## క్లుప్తంగా

### కేజీబీవీకి రెండు ల్యాబ్‌లు మంజూరు

బి.కొత్తకోట : స్థానిక కేజీబీవీకి రెండు ల్యాబ్‌లు మంజూరైనట్లు ఎంఈవో–2 భీమేశ్వరాచారీ శుక్రవారం తెలిపారు. సైన్స్, కంప్యూటర్ లాబ్యలు మంజూరు కావడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగమని తెలిపారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కలిగేలా విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యాలయ ఆవరణలో నిర్మించిన నూతన భవనాల పనులు పూర్తయ్యాయని, త్వరలో వాటి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

### ఉచిత వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం : స్థానిక సుదర్శన్ మెడికల్ షాప్ వద్ద ఉన్న షీఫా క్లినిక్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దాత దిలీప్‌రెడ్డి సహకారంతో జరిగే నిర్వహించే శిబిరంలో ఉచితంగా పలు రకాల రక్త పరీక్షలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఎంఆర్‌పీఎస్ నాయకుల సంబరాలు

ములకలచెరువు : మండలంలోని సోంపల్లిలో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. మంద కృష్ణమాదిగ చేపట్టిన 30 ఏళ్ళ సుదీర్ఘ పోరాట ఫలితం కారణంగా సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమని నాయకులు సుధాకర్, వెంకట్రమణ, తిరుపాల్ తదితరులు పేర్కొన్నారు.

### 4న చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు

మదనపల్లె సిటీ : స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో ఈనెల 4వతేదీన చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తొగటవీరక్షత్రియ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం రక్తదాన శిబిరం, అన్న సంతర్పణ జరుగుతుందన్నారు. సాయంత్రం అమ్మవారిని పుష్పపల్లకిలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

### డీఎస్పీగా కొండయ్యనాయుడు బాధ్యతల స్వీకరణ



మదనపల్లె : మదనపల్లె సబ్ డివిజన్ పోలీస్ అధికారి(ఎస్‌డీపీఓ)గా శుక్రవారం డి.కొండయ్యనాయుడు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల జరిపిన డీఎస్పీ బదిలీల్లో వెయిటింగ్‌లో ఉన్న డి.కొండయ్యనాయుడును మదనపల్లె ఎస్‌డీపీఓగా నియమిస్తూ, ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డిని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా డీజీపీ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో డి.కొండయ్యనాయుడు డీఎస్పీ కార్యాలయంలో పూజా కార్యక్రమాల అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె డివిజన్ పరిధిలో నేరాల అదుపుకు, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.


### ఎస్సీ వర్గీకరణ హర్షణీయం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గుర్రంకొండ : ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామాంజులు అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1996 నుంచి ఎస్సీ వర్గీకరణ కోసంపోరాడుతున్న మందకృష్ణ మాదిగ ఆశయం నెరవేరిందన్నారు. ఈ చట్టంతో ఎస్సీల్లో అట్టడగు ఉపకులాలందరికి రిజర్వేషన్లు అందుతాయని, తద్వారా వారికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాసులు, రెడ్డిమునినాయుడు, శీనా, రామ్మూర్తిలు పాల్గొన్నారు.

### మానవత్వంతో అంత్యక్రియలు



దహన సంస్కరణలు నిర్వహిస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ : ఊరు కాని ఊరు... పొట్టికూటి కోసం వచ్చి మృత్యువాత పడ్డాడు. దహన సంస్కరణలు చేయడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు స్పందించి మానవత్వం చాటుకున్నారు. బీహార్‌కు చెందిన రాజ్‌బల్లి క్వారీలో కూలీ పనులు చేసుకుని జీవించేవాడు. ప్రమాదశాత్తు మృతి చెందడంతో బంధువులు ఎవ్వరూ రాకపోవడంతో విషయాన్ని తెలుసుకున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు శుక్రవారం రాజ్‌బల్లిని అంబులెన్స్‌లో శ్మశాన వాటికకు తీసుకెళ్లి హిందూ సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు కిరణ్, ఆనంద,ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

# స్టాక్ పాయింట్లలో ఫిర్యాదు పుస్తకం

**మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్**



బి.కొత్తకోట స్టాక్ పాయింట్‌లో నిల్వలు పరిశీలిస్తున్న మేఘ స్వరూప్

బి.కొత్తకోట : పౌర సరఫరాల స్టాక్ పాయింట్లలో ఫిర్యాదు పుస్తకాలను ఏర్పాటు చేయిస్తున్నామని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఇందిరమ్మకాలనీలోని స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. గోదాముకు సరఫరా చేసిన బియ్యం, కందిపప్పు, జొన్నలు ఎంత మేరకు డీలర్లకు సరఫరా చేశారు, ఎంత నిల్వ ఉంది, అన్న వివరాలను పరిశీలించారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు స్టాక్‌పాయింట్లలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అందించే చౌక వస్తువుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ పాయింట్ నిర్వహణపై సూచనలు చేసామని, ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టాలో పరిశీలిస్తామన్నారు. ఫిర్యాదు పుస్తకం ఏర్పాటు చేయించి వాటి ద్వారా అందే సూచనలు, సలహాలను పరిశీలించనున్నట్టు చెప్పారు. అక్రమ లేఅవుట్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ఇన్‌చార్జ్ తహసీల్దార్ అన్సారీ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట డీటీ రవి, ఆర్‌ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణీ, వీఆర్‌ఓలు హైదర్, అశోక్, వరదరాజులు ఉన్నారు.

**రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి**

మదనపల్లె : మదనపల్లె డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం మదనపల్లె డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ...డివిజన్‌లోని రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషిచేయాలన్నారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో మదనపల్లె డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శేషయ్య, జిల్లా కార్యదర్శి ఆర్.ఎం.బాబ్జీ, వైస్ ప్రెసిడెంట్ రాజేష్, గురుప్రసాద్, ఫిరోజ్‌ఖాన్, విద్యాసాగర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఇమ్రాన్, డీటీ.ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టామని కమిషనర్ పీఆర్.మనోహర్ అన్నారు. శుక్రవారం స్థానిక బీసీకాలనీ సచివాలయం పరిధిలో మురుగునీటి కాలువలు శుభ్రం చేయడంపై స్వయంగా పరిశీలించారు. పారిశుధ్యం కార్మికులు చేస్తున్న పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డయేరియా సోకకుండా చర్యలు తీసుకుంటున్నామని, రోడ్లు, వీధుల్లో చెత్త పారబోయకుండా తొట్టెల్లో వేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు సహకరించాలని కోరారు.

**పారిశుధ్యానికి మొదటి ప్రాధాన్యత**

కేవీపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ ఎస్‌ఏ. గఫూర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దిపట్లవాండ్లపల్లె పంచాయతీలో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. పంచాయతీ చెత్త సేకరణ వాహనంలో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై మాలమహానాడు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునః పరిశీలించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధరణి కుమార్ అన్నారు. శుక్రవారం సుప్రీం కోర్టును నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఇదే అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు సుభాష్, మల్లికార్జున, ద్వారక, ఎం. చంద్రయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం**

కలికిరి : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్టీడి హరి విమర్శించారు. కలికిరిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 341, 14 ప్రకారం వర్గీకరణ జరిగిందని, ప్రస్తుతం వర్గీకరణ పార్లమెంటు ఆమోదంతో జరగాల్సి ఉందన్నారు. జాతీయ స్థాయిలో ఎంతో సున్నితమైన వర్గీకరణపై సుప్రీం తీర్పుతో మాలమహానాడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. మాలమహానాడు నాయకులు నరేష్, సహదేవ, రామక్రిష్ణ, సురేష్, భానుప్రకాష్, శ్రీనివాసులు, చిన్న, హరి, బాబు, సురేష్‌కుమార్, రెడ్డిశేఖర్, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

# చౌకబారు ఆరోపణలు మానుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి**



పీలేరు : ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ తనపై చౌకబారు విమర్శలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉండి పీలేరు పంచాయతీ నిధులతో కారుకు డీజిల్ పట్టుకున్నానని పసలేని ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎప్పుడైనా తాను పంచాయతీ నిధులతో డీజిల్ పట్టుకున్నట్లు నిరూపించాలని డిమాండ్ చేశారు. సీసీ పూటేజీలు పరిశీలించాలని తెలిపారు. మీ హామీలు నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం తగదన్నారు.

# అన్ని భాషలకు మూలం సంస్కృతం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చెన్నకేశవులు

కేవీపల్లె : అన్ని భాషలకు సంస్కృతం మూలమని గ్యారంపల్లె ఏపీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవులు అన్నారు. శుక్రవారం గ్యారంపల్లె ఏపీ ఆర్‌ఎస్ నందు సంస్కృతంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందడానికి మ్యాథ్స్ ఎంతగా ఉపయోగపడిందో, వివిధ భాషలు అభివృద్ధి చెందడానికి సంస్కృతం ఉపయోగపడిందని తెలిపారు. సంస్కృతం నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో పఠనాశక్తి, మానవతా విలువలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు గోవర్ధన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ అధ్యాపకులు రామకృష్ణ, హరినాథ, నాగేంద్ర, కొండయ్య, షకీలు మహమ్మద్, సయ్యద్‌బాషా, నాగరాజునాయక్, అన్నపూర్ణ, సౌజన్య, భారతి, తనూజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పెద్దతిప్పసముద్రం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు పీహెచ్‌సీ డాక్టర్ శంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో, మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉంటే దోమలు విస్తారంగా ప్రబలుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో పూల కుండీలు, రిఫ్రిజిరేటర్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ కవర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడగట్టిన నీరు తాగాలన్నారు. దోమ తెరలు వినియోగించాలని, ఆహారం తీసుకునే సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ప్రధానంగా వేడి పదార్థాలు తీసుకోవాలని, వండిన ఆహార పదార్థాలకు తప్పని సరిగా మూతలు వేయాలన్నారు. అనారోగ్యమైతే తక్షణమే ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని శంకర్ సూచించారు.

# బీసీజీ టీకాతో టీబీ నివారణ



బీసీజీ టీకాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె : బీసీజీ టీకాతో టీబీ వ్యాధిని నివారించవచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం దొంతివీధిలోని మక్కామసీదు వద్ద పలువురికి బీసీజీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...60 సంవత్సరాలు నిండిన వారందరికీ, 18–60 సంవత్సరాల వయస్సులోపు ఉన్న వారికి, ఐదేళ్ల క్రితం టీబీ వ్యాధి వచ్చి తగ్గిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగతాగేవారికి బీసీజీ టీకాలు వేసి వ్యాధి నివారించేదిశగా కృషి చేస్తున్నామన్నారు. ఈ లక్షణాలు కలిగిన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకాలు వేసి టీబీ నుంచి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో మసీదు ముతవల్లీ , సెక్రటరీ షఫీ, సూపర్‌వైజర్ మహి, ఏఎన్‌ఎం లావణ్య, వనజ, రాధా తదితరులు పాల్గొన్నారు.

### భూ బాధితుల సదస్సు విజయవంతం చేయండి

కలకడ : మదనపల్లెలో 4వ తేదీన నిర్వహించే భూ బాధితుల సదస్సుల్లో బాధితులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ కోరారు. శుక్రవారం కలకడ బస్టాండ్‌లో పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టిఎల్ వెంకటేశ్‌తో కలిసి ప్రసంగించారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను తగలబెట్టిన వారిని శిక్షించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, భవన నిర్మాణ సంఘం నాయకులు మురళి, మహబూబ్‌వల్లీ, హరి, వెంకట్రమణ, జిలానీ, బాబు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### 99.25 శాతం పెన్షన్‌ల పంపిణీ

**– ఎంపీడీఓ భానుప్రసాద్**

మదనపల్లె : మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నంకు 99.25 శాతం మందికి పెన్షన్‌లు అందించామని ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. అన్నమయ్య జిల్లాలోనే మదనపల్లె మండలంలో అధిక పెన్షన్ లబ్దిదారులు 14,203 మంది ఉన్నారని, వీరిలో 14,097 మందికి పెన్షన్‌లు పంపిణీ చేశామన్నారు. మిగిలిన 104 మందిలో వివిధ కారణాలతో చనిపోయిన వారు 50, ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న వారు 23, ఇతర రాష్ట్రాలకు వెళ్లినవారు 24, గ్రామం నుంచి వలస వెళ్లిన వారు 9 మంది ఉన్నారన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రామసముద్రం : కర్ణాటక రాష్ట్రం సోమయాజులపల్లి సమీపంలోని గోపాలపురంకు చెందిన నారాయణప్ప(60) ను లారీ వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. బియ్యం కొనుగోలు కోసం నారాయణప్ప పుంగనూరుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా దిన్నిపల్లి సమీపంలోని గాంధీనగర్ దగ్గర వెనుక నుంచి లారీ ఢీకొంది. ప్రమాదంలో నారాయణప్ప తలకు బలమైన గాయం కాగా చేతులకు, కాళ్లకు స్వల్ప గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం రామసముద్రం పిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేశారు.

### మూగజీవాలకు టీకాలు వేయించండి

తంబళ్లపల్లె : మూగజీవాలకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ సుమిత్రాదేవి సూచించారు. శుక్రవారం పశువైద్య కేంద్రంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల పశువైద్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గొర్రెల్లో బొబ్బల వ్యాధి, నీలి నాలుక వ్యాధి నివారణకు రెండు మండలాల్లో సుమారు 68 వేల జీవాలకు టీకాలు వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పశువులలో ముద్దచర్మ వ్యాధి సోకకుండా ముందస్తు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు సుజశ్రీ, ఉస్మాన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మదనపల్లె సిటీ : భారత జాతీయ పతాక రూపకర్త, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతి వేడుకలు శుక్రవారం స్థానిక మదనపల్లె రచయితల సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గురించి రచయితలు కొనియాడారు. ఆయన మృతి చెందినా ఆయన ఎప్పటికి మరవలేమన్నారు. కార్యక్రమంలో మరసం కార్యదర్శి లింగాల యుగంధరాచారి, సభ్యులు నాగభూషణరావు,రామమోహన్‌నాయుడు, వాసుదేవరావు,ప్రసాద్‌శర్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య**

వాల్మీకిపురం : జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య అని స్థానిక జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. శుక్రవారం స్థానిక తరిగొండ రోడ్డులోని ఉర్దూ మైనార్టీ గురుకుల పాఠశాలలో పింగళి వెంకయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, జాతీయ పతాకాలను చేతపట్టుకుని ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవమల్లిక, ఉపాధ్యాయులు హబీబుల్లా, ఆజం, అరుణ, సురేఖ, సబిత, గీతాంజలి, సోఫియాబేగం, రమీజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభం



డిజిటల్ క్లాస్‌రూమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మండలంలోని వేంపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఈ–విద్యాలోక, బెంగళూరు సహకారంతో, స్థానిక గాంధీ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాబోధన అందించాలనే లక్ష్యంతో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. దృశ్యరూపంలో పాఠాలు బోధించడం వల్ల త్వరగా మరచిపోకపోవడం, వీడియోల ద్వారా బోధన జరపడంతో ఆయా సబ్జెక్టులపై సమగ్ర అవగాహన కలుగుతుందన్నారు. గాంధీ గ్రామీణ అభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ...మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లోని 8 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు డిజిటల్ క్లాస్‌రూమ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకరరెడ్డి, హెడ్‌మాస్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, కిషోర్‌నాయుడు, గట్టురాజా, సర్పంచ్ ప్రభాకర్, గురునాథ్‌యాదవ్, జీవి.నాయుడు, జేసీబీ వేణు, మంజునాథ్, మాజీ జెడ్పీటీసీ రంగప్ప, గార్డ్ సంస్థ ప్రతినిధులు రఫీ, ఉజ్వల్ పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరించాలి



ఆక్రమణలకు గురైన భూములను బాధిత రైతులతో కలసి పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గుర్రంకొండ : మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ ప్యారంపల్లె రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ అన్నారు. శుక్రవారం మండలంలోని పార్యంపల్లె గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకొన్నారు. గ్రామానికి చెందిన ఓ భూ స్వామి దౌర్జన్యంగా ఆక్రమించుకొన్న భూములను బాధిత రైతులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతుల భూములను దౌర్జన్యంగా లాక్కొని రైతులపై దాడులు చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. చిత్తూరుకు చెందిన ఓ భూ స్వామి ప్యారంపల్లె గ్రామం చుట్టూ సుమారు 300 ఎకరాలకు పైబడి భూములను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారన్నారు. ఇందులో కొంత మంది రైతులు తమ భూములు అమ్మమని చెప్పడంతో వారి భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి దారి లేకుండా చేయడం దారుణమన్నారు. వీటిపై అధికారులు విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిపిఐ నాయకులు మురళీ, వెంకటరమణ, విజయ్‌భాస్కర్, రమణ, జనార్ధన్‌లు పాల్గొన్నారు.

# ప్రపంచ జానపద సంబరాలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డెప్ప

కేవీపల్లె : ఈ నెల 22న తిరుపతిలో నిర్వహించే ప్రపంచ జానపద సంబరాలు విజయవంతం చేయాలని తిరుపతి మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కలకడ రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని గర్నిమిట్ట యల్లమ్మ ఆలయం వద్ద జానపద కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కష్టపడి చేసేవారికి జానపద రూపాలు ఎంతో ఉపసమయం కల్గిస్తాయన్నారు. గ్రామీణ జానపద కళాకారులు ప్రపంచ జానపద సంబరాల్లో పాల్గొని తమ ప్రతిభ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఊటుపల్లె శ్రీనివాసులు, గంగన్న, సిద్దయ్య, కృష్ణయ్య, రెడ్డెప్ప, నాగయ్య, వాసుదేవ, శంకర తదితరులు పాల్గొన్నారు

# పశువులకు ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ రామాచార్లపల్లెలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ పశువుల పెంపకం, పశుగ్రాసం, దాణా, సాధారణ వ్యాధులు, పాల ఉత్పత్తి గురించి తెలియజేశారు. సుమారు 180 పశువులకు బ్రూటెక్స్ స్ప్రే చేశారు. 60 దూడలకు నట్ట నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో ఏడీ రోహిణి, డాక్టర్ లారెన్స్, లైవ్‌స్టాక్ అధికారి నరసింహారెడ్డి, సర్పంచు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్స్ ఫార్మ కంపెనీ బిజినెస్ మేనేజర్ రెడ్డిబాబు, చంద్రశేఖర్ పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు.

# తల్లిపాలే బిడ్డకు అమృతం



కలకడ: తల్లిపాల గురించి తెలియజేస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి



మదనపల్లె : తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది



ములకలచెరువు : తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న దృశ్యం

కలకడ : తల్లి పాలే బిడ్డకు అమృతమని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని దిగువపాళ్యం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. బిడ్డపుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు తాపడం మొదలు పెట్టాలని ముర్రుపాలలో అధికంగా వ్యాధినిరోధక శక్తి ఉంటుదని గుర్తు చేశారు. ప్రతి తల్లి బిడ్డకు కనీసం ఆరుమాసాల పాటు ఇవ్వాలని తల్లులకు సూచించారు. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి రొమ్ముక్యాన్సర్ నుండి రక్షణ కలుగుతుందన్నారు. బిడ్డకు ప్రభుత్వం అందించే వ్యాధి నిరోధక టీకాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో యంపీహెచ్‌ఈఓ జయరామయ్య, ఆపాఠశాల హెచ్‌యంసత్యవాణి, ఆరోగ్యసిబ్బంది లక్ష్మి, రోజ, స్వర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

**తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం**

మదనపల్లె : తల్లిపాలు మాత్రమే బిడ్డకు శ్రేష్టమని, ఆరునెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆవరణలోని డెయిక్ భవనం వద్ద శుక్రవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు దోహదం చేస్తాయన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు పాలు తాగిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవని, రోగనిరోధక శక్తి అదనంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి, ఆర్ఎంఓ ప్రసాదరాజు, నర్సింగ్ సూపరిండెంట్ నాగవేణి, వైద్యులు పాల్గొన్నారు.

**తల్లిపాల వారోత్సవాలు**

ములకలచెరువు : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ అధికారులు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ సరస్వతి మాట్లాడుతూ తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల బాలింతల్లో మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతల ఆహార నియమాలపై అవగాహన కల్పించారు.